# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 30 । జూలై । 2025






**మద్యం మత్తులోనే బడికి..!**

చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువే గతి తప్పారు. ప్రతి రోజు తాగి పాఠశాలకు వస్తుండటంతో కలెక్టర్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. -8లో



**ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం**

ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కడప–అనంతపురం జట్లు తలపడ్డాయి. -8లో

గరిష్టం/కనిష్టం
34.2/26.2

**వాతావరణం**

జిల్లాలో మంగళవారం 26.2 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

**కడప కోటిరెడ్డిసర్కిల్:** జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు ఆన్‌కాల్ డ్రైవర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 18 నెలల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ, మెడికల్ పూర్తి చేయించిన ఫిట్ డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకుంటారన్నారు. ఆసక్తిగల వారు 99592 25773, 62810 56690 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

### సరోగసి కేంద్రాల తనిఖీ



కడపలో సరోగసి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

**కడప రూరల్:** వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఆర్‌టీ/సరోగసి యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న కేంద్రాలను తనిఖీ చేశారు. కడప నగరంలో లెవెల్-2 మూడు, లెవెల్-1 రెండు, జమ్మలమడుగు డివిజన్‌లో లెవెల్-2 రెండు, లెవెల్-1 ఒకటి , ఒక ఏఆర్‌టీ బ్యాంకులను ఏఆర్‌టీ టీం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ నాగరాజు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భవ్య, డిప్యూటీ డెమో రమణమ్మ, కుమారి, పాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రేడింగ్ చేస్తే మంచి ధర



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

**పులివెందుల రూరల్:** రైతులు చీనీ కాయలను గ్రేడింగ్ చేసుకుని మార్కెట్ తీసుకొస్తే మంచి ధరలు లభిస్తాయని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని చీనీ కాయల మార్కెట్‌లో వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు చీని కాయలను మార్కెట్ తీసుకొచ్చే సమయంలో సైజులు వారీగా చీనీ కాయలను గ్రేడింగ్ చేసుకుని తీసుకురావాలన్నారు. ఈ విషయాన్ని రైతులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించామన్నారు. రైతులు సరుకు అమ్మిన తర్వాత తప్పనిసరిగా పట్టి పొందాలన్నారు. చీనీ కాయలను కోసేందుకు, రవాణా చేసేందుకు కూలీల కొరత ఉందని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి అజాద్‌వలి, మార్కెట్ కమిటీ సిబ్బంది, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**రాయచోటి జగదాంబసెంటర్:** మదనపల్లి మండలం వలసపల్లిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశాలకు ప్రస్తుతం 8వ తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 2011 మే 1 నుంచి 2013 జూలై 31 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 2009 జూన్ 1 నుంచి 2011 జూలై 31 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 23వ తేదీలోపు చేసుకోవాలని ఆమె వివరించారు.

**6వ తరగతిలో..**

**రాజంపేట:** మండల పరిధి నారమరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల గడువును ఆగస్టు 13 తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ గంగాధరన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపుకోవాలని తెలిపారు. మరిన్న వివరాల కోసం నవోదయ విద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని వివరించారు.

# ధర దడ!


- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- కొండెక్కిన కొబ్బరి... ఘాటెక్కిన ఎండు మిరప
- చేదెక్కిన బెల్లం... మండుతున్న ఎర్రగడ్డల ధరలు



కిరాణాషాపు



బద్వేలు పట్టణంలోని కూరగాయల మార్కెట్



**కడప అగ్రికల్చర్/బద్వేలు:** నిత్యావసర సరుకుల ధరలు కొండెక్కాయి. ఎర్రగడ్డలు.. ఎండు మిరప.. పప్పు.. ఉప్పు.. బెల్లం.. అల్లం.. ఒకటా రెండా నిత్యావసర సరుకుల ధరలన్నీ చుక్కల్ని తాకుతున్నాయి. ఇక కూరగాయలు ధరలు కూడా తగ్గేదే లేదంటూ అమాంతంగా పెరిగి సామాన్యుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ధరల భారంతో జీవనం సాగించడం భారంగా మారిందని సామాన్య ప్రజలు వాపోతున్నారు.

**ధరల ఘాటు..**

ఇటీవల టమోట ధరలు మోత మోగగా ప్రస్తుతం ఉల్లిగడ్డల వంతు వచ్చింది. కొనకుండా కోయకుండానే కళ్లలో ఉల్లి నీళ్లు తెప్పిస్తోంది. ఇక నిత్యం కూరల్లో వాడుకునే ఎండు కొబ్బెర కిలో గతేడాది రూ. 180 ఉండగా ఈ ఏడాది రూ. 350లకు చేరింది. కిలోపైన ఏకంగా 170 పెరిగింది. దీంతోపాటు ఎండు మిర్చి గతేడాది కిలో రూ. 120 ఉండగా ప్రస్తుతం రూ. 160కు చేరుకుంది. కిలో చింతపండు రూ. 100 నుంచి రూ. 140కి, బెల్లం రూ. 50 నుంచి 65 రుపాయలకు చేరింది. ఇక వంటనూనె ధరలు భగ్గుమంటున్నాయి. గతేడాది పామాయిల్ కిలో ధర రూ. 90 ఉండగా ఈ ఏడాది కిలో రూ. 120 పెరిగింది. సన్‌ఫ్లవర్ గతేడాది కిలో రూ. 112 ఉండగా ఈ ఏడాది కిలో రూ. 145 పెరిగింది. గతేడాది వేరుశనగ కిలో రూ. 150 ఉండగా ప్రస్తుతం కిలో రూ. 155 ఉంది.

- మొన్నమొన్నటి వరకు తక్కువగా ఉన్న కూరగాయల ధరలు నేడు అమాంతంగా పెరిగాయి. కిలో 10 రూపాయల ఉన్న టమోట నేడు రూ. 30లకు చేరుకున్నాయి. అలాగే కిలో పచ్చిమిరప 20 నుంచి 60 రూపాయలకు చేరాయి. వీటితోపాటు క్యారెట్, బీన్స్ వంటివి 60 రూలకు చేరింది. అనప, మునగలు కిలో రూ. 50లు పలుకుతున్నాయి.

### » నేతల మాటలు నీటి మూటలు..



కొండెక్కిన ధరలు నేలకు దింపుతామంటూ ఎన్నికల్లో నేతల మాటల గారడీని తలపిస్తున్నాయి. సగటు మనిషి జీవన ప్రమాణాల్లో మార్పులు తెద్దామన్న చిత్తశుద్ధి ఏ నాయకుడికి లేకపోయింది. సంచి నిండా డబ్బు పట్టుకెళ్తే నిత్యావసర వస్తువులు,కూరగాయలు జేబు నిండా రావడం లేదు. బియ్యం ధర వింటే దెయ్యాన్ని చూసినంత భయమేస్తోంది. కాస్తో కూస్తో మంచి రకం బియ్యం కేజీ ఎనభై పై మాటే. కంది పప్పు మాట వింటే కలలో కూడా కెవ్వుమనాల్సి వస్తోంది. రూ.150 నుంచి రూ.175లు పలుకుతున్నాయి. పల్లీల మాట వింటేనే తల్లీ నీకో దండం అనాల్సిందే. మంచిరకం రూ.140 నుంచి రూ.160లు ఉన్నాయి.గ్యాస్ బండ ఎప్పుడో గుదిబండై కూర్చుంది. నేతల మాటలు అమలయ్యేదెప్పుడో!

### కూరగాయలను కొనలేకున్నాం



మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. నిత్యం సామాన్యులు సైతం వాడుకునే టమోట, మిరపకాయలు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. నిన్నామొన్నటి వరకు కిలో రూ. 10 ఉన్న టమోట రూ. 30 చేరింది. మిరపకాయలు 60 రూపాయలు ఉన్నాయి. దీంతో పచ్చడి మెతుకులు కూడా తినే పరిస్థితి కరువైయింది.

– అంబటి రాజశేఖర్‌రెడ్డి, ఆలంఖాన్‌పల్లి, కడప

### ఆకాశాన్నంటిన నిత్యావసరాల ధరలు



బియ్యం,బ్యాలు,ఉద్ది పప్పు శనకాయపప్పులు చింతపండు ఎండుమిర్చి దేనిని ముట్టుకున్నా ధరలు కాలిపోతున్నాయి. ఏమి తిని బతకాలయ్యా.. రేట్లు ఇట్లా మండిపోతుంటే పట్టించుకునే వారు లేరు. కూరగాయలు పండే కాలంలోనే ఇలా రేట్లు మండిపోతుంటే వచ్చే ఎండాకాలం ఎలా ఉంటాయో తల్చుకుంటేనే భయమేస్తోంది. ధరలు తగ్గించే మార్గం చూడండయ్యా..

–సుబ్బమ్మ, గృహిణి, గాంధీనగర్, బద్వేలు

### బెంగుళూరు నుంచి వచ్చే కూరగాయలన్నీ ధర ఎక్కువే



బెంగుళూరు నుంచి వచ్చే కూరగాయల ధరలు ఎక్కువగానే ఉంటాయి. క్యారెట్,కాకరకాయలు, బీన్స్ ఒక రకం వంకాయలు,బోండామిర్చి, ఆలుగడ్డలు,తదితర కూరగాయలు బెంగుళూర్ నుంచి రావాల్సింది. ధరలెక్కువగా ఉండడం వల్ల సాయంత్రం వరకూ అమ్మినా మాకు వేయి రూపాయలు కూలి మిగలడం లేదు. పచ్చి సరుకు త్వరగా అమ్ముడుపోతేనే పదిరూపాయలు ఉంటాయి. లేకుంటే నష్టం తప్ప లాభం లేదు.

–సుబ్బరాయుడు, కూరగాయల అంగడి యజమాని,బద్వేలు

## అక్షరాస్యతలో భాగస్వాములు కావాలి

జెడ్పీ డిప్యూటీ సీఈఓ




మాట్లాడుతున్న జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సి.సుబ్రమణ్యం

**కడప సెవెన్‌రోడ్స్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉల్లాస్ అక్షరాంధ్ర' కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సి.సుబ్రమణ్యం అన్నారు. వయోజన విద్య ఉప సంచాలకులు ఎంవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన మంగళవారం జెడ్పీ ఆవరణలోని డీఆర్‌సీ భవనంలో అధికారులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

జిల్లాలో 3,33,500 మంది వయోజనులైన నిరక్షరాస్యులు ఉన్నట్లు 2023లో జీఎస్‌డబ్ల్యూఎస్ నిర్వహించిన సర్వేలో వెల్లడైందని పేర్కొన్నారు. మొదటి దశలో 1,01,465 మంది అక్షరాస్యులుగా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. రానున్న మూడేళ్లలో అక్షరాస్యతలో జిల్లాను మొదటిస్థానంలోకి తీసుకురావాలని కోరారు. వయోజన విద్య ఉప సంచాలకులు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 7 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేది వరకు వంద గంటలపాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. నిరక్షరాస్యులకు ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీలలో శిక్షణ ఇస్తామన్నారు. మార్చిలో వారికి పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఏపీడీ ప్రసాద్, మెప్మా పీడీ కిరణ్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# అక్కాచెల్లెళ్లు సజీవ దహనం

- మంటల్లో కాలి ఇద్దరు మృతి
- అంతుచిక్కని కారణాలు



మృతి చెందిన ఆఫ్రీన్



ఫాతిమా మృతదేహం

**రాయచోటి:** పేద కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు సజీవ దహనమైన సంఘటన రాయచోటిలో మంగళవారం సాయంత్రం సంచలనంగా మారింది. పట్టణంలోని పూజారి బండ వీధిలో చోటు చేసుకున్న సంఘటనలో.. అక్క షేక్ బీబీ ఫాతిమ (27), షేక్ ఆఫ్రిన్ (25) మంటల్లో కాలిపోయి మృత్యువాత పడ్డారు. అయితే కారణాలు అంతుకు చిక్కడం లేదు. వివరాలిలా ఉన్నాయి. పూజారి బండకు చెందిన షేక్ హుస్సేన్, మాబ్ జాన్‌లకు షేక్ బీబీ ఫాతిమా, షేక్ ఆఫ్రిన్‌లు సంతానం. వీరిద్దరూ ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నారు. తరువాత ఇంటి వద్దనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. హుస్సేన్ భార్య మాబ్‌జాన్‌తో కలిసి ఇంటి సరుకుల కోసం మంగళవారం సాయంత్రం బజారుకు వెళ్లిన సమయంలో.. ఇంటిలో బాలికలు ఇద్దరే ఉన్నారు. ఆ సమయంలోనే గడియ పెట్టుకొని అక్కాచెల్లెళ్లు శరీరాలపై కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకున్నట్లు స్థానికుల సమాచారం. మంటల్లో కాలుతుండగా చుట్టుపక్కల వారు గమనించి.. తలుపులు పగులకొట్టి వారిద్దరినీ ఆసుపత్రికి చేర్చారు. అప్పటికే శరీరమంతా తీవ్రంగా కాలిపోయిన ఫాతిమా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆఫ్రీన్ తీవ్ర గాయాలతో విషమ పరిస్థితిలో ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది.

**ఇంటిలో ఎవరూ లేని సమయంలో..**

అక్కాచెల్లెళ్లు ఒకేసారి మంటల్లో కాలిపోయిన సంఘటన రాయచోటి పట్టణంలో సంచలనంగా మారింది. ఈ సంఘటనపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# మానవతావాదులకు పీ-4 గొప్ప అవకాశం

- మార్గదర్శుల సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- పేదరిక నిర్మూలనకు మార్గదర్శులవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

**కడప సెవెన్‌రోడ్స్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ-4 ఫౌండేషన్ కార్యక్రమం విధానం మానవతను చాటుకునే మార్గదర్శులకు గొప్ప అవకాశం అని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీ-4 కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని మార్గదర్శకులతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి.. జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మార్గదర్శులతో కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పీ4 ఫౌండేషన్ ద్వారా.. ప్రతి బంగారు కుటుంబం కూడా భవిష్యత్ మార్గదర్శిగా ఎదగగలదని ఆకాంక్షించారు. పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్ షిప్) కార్యక్రమం ద్వారా జిల్లాలో మార్గదర్శులకు పీ4 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తలా పిడికెడు బియ్యం పోగుచేసి.. ఒక కుటుంబం ఆకలి తీర్చే పురాతన పద్ధతిని ఆధారంగా చేసుకుని, పేదరిక నిర్మూలనలో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం పీ4 ఫౌండేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలోని అన్ని కుటుంబాలను 360ని కోణంలో వారి అవసరాలను పరిశీలించి... ఒక యాప్ ద్వారా ఆయా కుటుంబాల అవసరాలను సూచించడం జరిగిందన్నారు. మార్గదర్శులుగా మీకు నచ్చిన, చేయదగిన సాయాన్ని, అవసరాన్ని కోరే కుటుంబాలకు సహాయం అందించవచ్చన్నారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించడంతో పాటు వారిని దత్తత తీసుకునేందుకు మార్గదర్శులు సహృదయంతో ముందుకు సాగాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రవాసాంధ్రులను కూడా భాగస్వామం చేసుకొని బంగారు కుటుంబాల దత్తత ఎంపిక నమోదు క్షేత్ర స్థాయిలో వేగవంతంగా పూర్తి చేసి తప్పక ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లతో పలు పీ4 బంగారు కుటుంబాలను గుర్తించి వారి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పీ4 బంగారు కుటుంబాల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మార్గదర్శుల నుంచి వారు చేస్తున్న సేవలు, వారి అభిప్రాయాలు, సలహాలను స్వీకరించారు. కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్ర మోహన్, సిపిఓ హజరతయ్య, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టాలెక్కని వారణాసి రైలు

సప్త మహాక్షేత్రాల్లో ప్రాధాన్యమైనది వారణాసి. వరుణ, అసి నదుల కలియక ఫలితంగా విష్ణుమూర్తి, నారాయణునికి తొలి ఆలయంగా ఏర్పడిన పవిత్ర స్థలం. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒక్కచోట ఉన్న క్షేత్రం. అన్నపూర్ణదేవి కొలువైన ప్రాంతం.. ఇలా వారణాసి ఎంతో ప్రాశస్త్యం చెందింది. ప్రతి హిందువు జీవితంలో ఒక్క సారైనా దర్శించి తరించాలనుకుంటారు. అటువంటి చోటికి అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల మీదుగా లు ఒక్కటీ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.



కాశీ పట్టణం

- వారణాసికి డైరెక్ట్ బండి లేక ఇక్కట్లు
- అంచెలంచెలుగా యాత్ర
- గూడురు జంక్షనే దిక్కు
- కడప మీదుగా నడపాలని డిమాండ్

**రాజంపేట:** ఒకప్పుడు కాశీకి పోతున్నారంటే.. ఇక తిరిగి రారేమో అన్న నానుడి ఉండేది. నేటి సామాజిక యుగంలో వాటిని కొట్టిపారేస్తూ.. కాశీకి చేరుకొని తిరిగి క్షేమంగా గమ్యానికి చేరుకునే రవాణా సౌకర్యాలు ఉన్నాయి. అయితే రాయలసీమ జిల్లాల నుంచి వారణాసి(కాశీ) వెళ్లేందుకు రైల్వే వ్యవస్థ ఆవిర్భావం నుంచి ఒక్క రైలు కూడా నడిపించకపోడవం విచా రకరమని భక్తులు భావిస్తున్నారు. బీజేపీ పాలనలో కాశీకి రైలు వేయడం మరిచి పోయిందనే విమర్శలు ఉన్నాయి. జిల్లాకు చెందిన ఎంపీ సీఎం రమేష్ రైల్వేస్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆయన అయినా అయోధ్య, వారణాసికి జిల్లా మీదుగా తిరుపతి నుంచి రైలు నడిపించాలని యాత్రికులు, పర్యాటకులు కోరుతున్నారు.

**తప్పని వ్యయ ప్రయాస:** వారణాసికి వెళ్లేందుకు అన్నమయ్య, వైఎస్సార్ జిల్లా వాసులు కష్టాలు పడుతున్నారు. ప్రతి హిందువు తన జీవితంలో ఒక్కసారైనా వారణాసికి వెళ్లాలనుకుంటారు. అటువంటి వారి కోసం కనీ సం ప్రభుత్వ సాయం లేకపోయినా, రవాణా సౌకర్యం కల్పించకపోవడంపై భక్తులు పెదవి విరిస్తున్నారు. పితృదేవతల అస్థికలు గంగలో నిమజ్జనం చేయడానికి కాశీకి వెళుతుంటారు. వ్యయప్రయాలతో వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు.

**తిరుపతి నుంచి రైలు వేస్తే..**

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచి అయినా కడప, చిత్తూరు జిల్లాలను కలు పుతూ వారణాసికి డైరెక్ట్ ట్రైన్‌ను పట్టాలెక్కించలేకపోయారు. సీమ నుంచి ఎనిమిది మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారు కాశీకి వెళ్లేందుకు డైరెక్ట్ ట్రి న్‌ను తీసుకొచ్చేలా రైల్వే మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తీసుకురావాలని భక్తులు విన్నవిస్తున్నారు. ఒంటిమిట్ట కోదండరామాలయం, దేవుని కడప, అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, నందలూరు సౌమ్యనాథాలయం, పుష్పగిరితోపాటు అతి ప్రాచీనమైన ఆలయాలకు ఉత్తరభారత్ దేశానికి చెందిన వారు రావడానికి ఈ రైలు అనుకూలమని, ఈ విషయాన్ని రైల్వేబోర్డు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

**అయోధ్యకు..** జిల్లా మీదుగా అయోధ్య, వారణాసికి రైలు నడిపితే తిరుపతి నుంచి రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, కర్నూలు సిటి, కాచిగూడ, ప్రయోగరాజ్, వారణాసి మీదుగా అయోధ్య వరకు రైలు నడిపితే ఇటు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనంతోపాటు కాశీలోని శక్తిపీఠం, అయోధ్య బాల రాములను దర్శనం చేసుకునేందుకు వీలవుతుంది.

### » గూడూరు జంక్షనే దిక్కు..

వారణాసి వెళ్లడానికి తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి గూడూరు మీదుగా వెళ్లే రైళ్లే అన్నమయ్య, వైఎస్సార్ జిల్లా వాసులకు దిక్కయింది. హైదరాబాద్ నుంచి కూడా వెళ్లే పరిస్థితులు నేడు ఉన్నాయి. మైసూరు నుంచి వారణాసికి ఒకే ఒక్క రైలు అనంతపురం జిల్లాలోని గుంతకల్ మీదుగా వెళుతుంది. అది నిండుగా ఉంటోంది. జనరల్, రిజర్వేషన్ బోగీలు కిటకిటలాడుతుంటాయి. కడప, చిత్తూరు, కర్నూలు జిల్లా వాసులు అంచెలంచెలుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో వారణాసికి ఎలా వెళ్లాలో అంతుపట్టడం లేదని భక్తులు వాపోతున్నారు. కాశీ ప్రయాణం సులభతరం చేసేందుకు రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అంగళ్లు విద్యార్థికి నాసా అవార్డు

**కురబలకోట:** అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రతిష్టాత్మక అవార్డు మండలంలోని అంగళ్లుకు చెందిన శెట్టి సీతారాం కుమార్తె శెట్టి జిష్ణవికి మంగళవారం లభించింది. ఈమె మదనపల్లె పట్టణంలోని చైతన్య స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. గత ఏడాది యువ అంతరిక్ష శాస్త్రవేత్తల పోటీ-25 టీమ్‌లో పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈమె టీమ్ రూపొందించిన బ్రహ్మాస్త్ర 3.0 అనే ప్రాజెక్టు నాసా నిర్వహించిన అంతర్జాతీయ శాస్త్రీయ పోటీలో మొదటి బహుమతి అందుకున్నట్లు నాసా వెల్లడించింది. ఈమెకు షీల్డ్‌ను, మెడల్‌ను అందజేశారు. తమ కుమార్తె శెట్టి జిష్ణవికి నాసా గుర్తింపు రావడం గర్వకారణంగా ఉందని శెట్టి సీతారాం సంతోషం వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా

### ఇంటర్ సిలబస్‌లో మార్పులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ డీఐఈఓ వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చిందని.. వీటికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లాలోని అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఇంటర్ డీఐఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం కడప మరియాపురం జూనియర్ కళాశాలలోని సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ విద్యామండలి 2025–26 విద్యా సంవత్సరం నుంచి తీసకొస్తున్న సంస్కరణను గురించి ప్రిన్సిపాల్స్‌కు వివరించారు. ఈ ఏడాది నుంచి ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు మ్యాథమేటిక్స్‌ను అడిషనల్ సబ్జెక్టుగా ఎన్నుకొని ఎంబైపీసీ సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. ఈ సంవత్సరం నుంచి సెకెండ్ లాంగ్వేజ్ ఉండదని దాని స్థానంలో 24 సబ్జెక్టులలో దేనినైనా ఎన్నుకోవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు మ్యాథమేటిక్స్ 1ఏ, 1బీ బదులుగా ఒకటే మేథమేటిక్స్ పేపర్ 100 మార్కులకు ఉంటుందని తెలిపారు. అలాగే బాటనీ, జువాలజీ సబ్జెక్టులకు బదులు కేవలం బయాలజీ మాత్రమే చదవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుభాన్, తీవ్రంగా గాయపడిన హరి

పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని బాలయ్యగారిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొన్న సంఘటనలో వల్లూరు మండలం డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన నాదెండ్ల సుభాన్(20) అనే యవకుడు మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ద్వారకానగర్ గ్రామానికి చెందిన పి.హరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సుభాన్, హరి ఇద్దరు ద్విచక్ర వాహనంలో సొంత పని నిమిత్తం కదిరికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బాలయ్యగారిపల్లె వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి ట్రాక్టర్ వెనుక వైపు ఢీకొంది. సుభాన్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. హరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సోమశిలలో.. అక్రమ వేట!

- ఆగస్టు 31 వరకు చేపల వేటపై నిషేధం
- ముంపు గ్రామాల నుంచి అక్రమ రవాణా
- నిద్రావస్థలో మత్స్యశాఖ అధికార గణం



సోమశిల బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు ఉపయోగించే నాటు పడవలు



వెలిగల్లు ప్రాజెక్టు సమీపంలో కొనసాగుతున్న చేపల విక్రయాలు

రాజంపేట : సోమశిల జలాశయం (నెల్లూరు జిల్లా సోమశిల)కు సంబంధించి బ్యాక్‌వాటర్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని అట్లూరు, గోపవరం, నందలూరు, ఒంటిమిట్ట మండలాల్లో విస్తరించి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్యాక్ వాటర్‌లో గుడ్డు దశలో ఉన్న చేపల సంపదపై అక్రమవేట కొనసాగుతోంది. చేపల వృద్ధి అడ్డుగా అక్రమవేట కొనసాగుతోంది. పరోక్షంగా చేపల సంపదకు గండి కొడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంతానోత్పత్తికి విఘాతం కలిగిస్తున్నారు.

**ఇలా అక్రమ రవాణా..**

ప్రధానంగా సోమశిల బ్యాక్ వాటర్‌లో చేప పిల్లలకు ప్రాణ సంకటంగా పరిణమించే అలివి వలను అక్రమార్కులు వినియోగిస్తున్నారు. ఒంటిమిట్ట మండలంలో పల్లాగట్ట నుంచి చేపలను అక్రమంగా వేటాడి నందలూరు మండలంలోని కోనాపురానికి చేర్చి, అక్కడి నుంచి చేపల మార్కెట్‌కు చేరుస్తున్నారు. పాత మాధవరం, బోయనపల్లె, చిన్నపురెడ్డిపల్లె, కొండమాచుపల్లె, గుండ్లమాడ, దొంగలసాని గ్రామాలతో పాటు నందలూరు, గోపవరం మండలాల్లో దర్జాగా చేపల అక్రమ వేట జరుగుతోంది.

**ఆగస్టు 31 వరకు వేటపై నిషేధం**

జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు సోమశిల బ్యాక్ వాటర్‌లో చేపల వేట నిషేధమని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా నాటు పడవల ద్వారా బ్యాక్‌వాటర్‌లోకి అక్రమంగా ప్రవేశించి చేప పిల్లలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం మత్స్యశాఖకు తెలియకుండా ఉండదని ముంపుబాధితులు పేర్కొంటున్నారు. బ్యాక్ వాటర్‌లో వేట నిషేధం అమలు కావడం లేదని వారంటున్నారు.

**యథేచ్ఛగా చేపల అక్రమ వేట..**

సోమశిల బ్యాక్‌వాటర్ సమీప ముంపు గ్రామమైన నందలూరు మండలంలోని కోనాపురం ప్రాంతంలో చేపల అక్రమ వేట కొనసాగుతోంది. నిషేధం ఆంక్షలను సైతం పట్టించుకోకుండా చేపలు పట్టేవారు బ్యాక్ వాటర్‌లోకి నాటుపడవలు వేసుకొని వెళుతున్నారు. దాదాపు 200 నుంచి 300 మంది వరకు మత్స్యకారులు వేటను కొనసాగించే క్రమంలో బ్యాక్‌వాటర్ వెంబడి తాత్కాలిక నివాసాలు వేసుకొని జీవిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, వైజాగ్, నెల్లూరు, ప్రకాశంతోపాటు మరికొన్ని జిల్లాల నుంచి మత్స్యకారులను రప్పించి, వారిచేత వేట చేయిస్తున్నారు. ప్రతి రోజు 10 నుంచి 15 టన్నుల చేపలు పట్టి తిరుపతి, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, కోలకత్తా చేపల మార్కెట్‌కు తరలిస్తున్నారు.

**మత్స్యశాఖ అధికారులకు తెలియకుండానే..**

చెన్నూరు, మాధవరం, కొడమలూరు తదితర ప్రాంతాలకు చెందిన కొందరు చేపల వ్యాపారంలో ఆరితేరి వున్నారు. వీరి కనుసన్నల్లో చేపల అక్రమవేట కొనసాగుతోంది. ఈ విషయం మత్స్యశాఖ అధికారులు, సిబ్బందికి తెలిసిన బహిరంగ రహస్యమే. వారికి మామూళ్లు అందుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. దీంతో సోమశిల బ్యాక్‌వాటర్‌లో జరిగే చేపల అక్రమ వేటను చూసీ చూడనట్లు, తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ముంపు వర్గాల వారు బహిరంగంగానే పేర్కొంటున్నారు. బాక్స్ రూ.7వేల నుంచి రూ.8వేల వరకు విక్రయిస్తున్నారు. వివిధ రకాల చేపలను పట్టుకొని బ్యాక్‌వాటర్ ఒడ్డుకు తీసుకొచ్చి కేజి రూ.120 నుంచి రూ.140 వరకు అమ్మకాలు చేస్తున్నారు. ఈ వ్యవహారం మత్స్యశాఖ అధికారులు, సిబ్బందికి తెలియకుండానే జరుగుతుందనేది వాస్తవం కాదు.

**మత్స్యశాఖ అధికారి ఏమంటున్నారంటే..**

సోమశిల బ్యాక్‌వాటర్‌లో చేపల అక్రమ వేటపై రాజంపేట మత్స్యశాఖ అధికారి మురళీని వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానన్నారు. బ్యాక్‌వాటర్‌లో చేపల వేట నిషేధం కొనసాగుతోంది. అయినా అక్రమంగా చేపలవేట కొనసాగుతుందన్న విషయం తనకు తెలియదన్నారు. ఈ విషయంపై తాను విచారణ చేసి, చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాగా, ఒంటిమిట్ట మండలం (వైఎస్సార్ జిల్లా) పరిధిలోని బ్యాక్‌వాటర్ విస్తరించిన ప్రాంతంలో స్థానికంగా ఉన్న వారిని ఖాళీచేసి వెళ్లిపోవాలని, చేపల వేట నిషేధం ఉందని హెచ్చరించామని మత్స్యశాఖ ఎఫ్‌డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. కోనాపురం వైపు చేపల వేట జరుగుతోందన్న సమాచారం రాజంపేటకు చెందిన అధికారి మురళికి తెలియజేశామని వెల్లడించారు.

**బ్యాక్‌వాటర్ పెరగుతోందని..**

రెండు, మూడు రోజుల్లో బ్యాక్‌వాటర్ పెరుగుతోందన్న సమాచారంతో బ్యాక్‌వాటర్‌లో చేపల అక్రమ వేటను వేగవంతం చేసుకుంటున్నారు. ముంపు గ్రామాల్లో చేపల రవాణా సందడి నెలకొంది. వాహనాలలో ఐస్ బాక్స్‌లో చేపలను రవాణా చేస్తున్నారు. బ్యాక్‌వాటర్‌లో దొరికినకాడికి చేపలను వల వేసి పట్టుకొని దొడ్డిదారిలో చేపల మార్కెట్‌కు తరలిస్తున్నారు. బ్యాక్ వాటర్ పెరిగితే అక్రమ వేటకు అడ్డుగా మారుతుందనే భావనలో వేట నిర్వాహకులు ఉన్నారు.

**వెలిగల్లులోనూ..**

గాలివీడు : వెలిగల్లు జలాశయంలో రెండు మాసాల పాటు చేపల వేటపై నిషేధం ఉన్నా విచ్చల విడిగా చేపల వేట కొనసాగుతోంది. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి మత్స్యకారులను ప్రలోభపెట్టి చేపలు పట్టిస్తున్నారు. అడ్డుకోవాల్సిన నిఘా యంత్రాంగం కళ్లకు గంతలు కట్టుకుని చోద్యం చూస్తోంది. రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా వలలు వేసి తెల్లవారుజామున సరుకు మొత్తం గాలివీడు, రాయచోటి, మదనపల్లె, కడప ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనధికారికంగా వేట సాగిస్తుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గాలివీడు విలేజ్ ఫిషర్స్ అసిస్టెంట్ రామాంజి నాయక్ తెలిపారు.

### వైభవంగా ఈశ్వరీదేవి జయంత్యుత్సవం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న మఠాధిపతి దంపతులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం మండలంలోని ఈశ్వరీదేవి మఠంలో ఈశ్వరీదేవి జయంత్యుత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఈశ్వరీ మాత సేవా సమితి ట్రస్ట్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. ఇందులో మఠాధిపతి వీరశివకుమారస్వామి, రాజరాజేశ్వరిదేవి దంపతులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ఊరేగింపు**

అష్టోత్తర(108) కలశాలతో భక్తజనం ఊరేగింపు ఆకట్టుకుంది. తర్వాత గుడి ఉత్సవం కమనీయంగా జరిగింది. మధ్యాహ్నం నైవేద్యం, మంత్ర పుష్పం, నీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. మఠాధిపతి వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో దేవదాయశాఖ అధికారులు, అమ్మవారి శిష్య బృందం ఏర్పాట్లు చేశారు.

# మద్యం మత్తులోనే బడికి..!



మద్యం మత్తులో తూగుతున్న హెడ్మాస్టర్



ఉపాధ్యాయులను విచారిస్తున్న ఎంఈఓలు, ఎస్ఐ

- కమలాపురం పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ తీరుపై గ్రామస్తుల మండిపాటు
- సస్పెన్షన్ వేటు వేసిన కలెక్టర్

కమలాపురం/ కడప ఎడ్యుకేషన్ : చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువే గతి తప్పారు. ప్రతి రోజు తప్ప తాగి పాఠశాలకు వస్తుండటంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే... కమలాపురం మండలం పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ ఓబుళరెడ్డి ప్రతి రోజు మద్యం తాగి పాఠశాలకు వస్తారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో మీడియా ప్రతినిధులు పాఠశాలకు చేరుకున్నారు. హెడ్మాస్టర్ ఓబుళరెడ్డి అప్పటికే తప్పతాగి టేబుల్‌పై పడుకుని ఉన్నాడు. మీడియా బృందం వెళ్లి నిద్ర నుంచి లేపి పలకరిస్తే తాను మద్యం సేవించానని, ఇది తప్పేనని, అయితే ఇంతకు మించి తాను ఏ తప్పు చేయలేదని, కావాలంటే తమ పిల్లలను అడగండి అని సమర్థించుకున్నాడు. ఈ రోజు కొత్తేమీ కాదని, ప్రతి రోజు మద్యం సేవించే పాఠశాలకు వస్తాడని, తమను హీనంగా హింసిస్తున్నాడని కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం హాజరు రిజిష్టర్‌లో సంతకం చేయడని, సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో రెండు పూటలకు సంబంధించిన సంతకాలు చేస్తాడని వారు తెలిపారు. కాగా ఆయనకు ఏవో కుటుంబ సమస్యలు ఉన్నాయని అందుకే మద్యం సేవిస్తుంటారని ఉపాధ్యాయ బృందం వెనుకేసుకొచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు కలసి నిమిషాల వ్యవధిలోనే హెడ్మాస్టర్‌ను అటెండర్ సాయంతో బయటకు పంపించి వేశారు. ఈ హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**విచారణ చేపట్టిన అధికారులు..**

మద్యం సేవించి పాఠశాలకు హాజరైన విషయం బయటకు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈఓలు బీబీ, సుభాషిణి, ఎస్ఐ విద్యాసాగర్ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఆయన ప్రతి రోజు మద్యం సేవించి వస్తారా? ఎప్పటి నుంచి ఇలా జరుగుతోంది తదితర వివరాలపై ఆరా తీసినట్లు సమాచారం. హెచ్ఎం ప్రవర్తనపై లిఖిత పూర్వకంగా ఉపాధ్యాయుల నుంచి తీసుకున్నట్లు తెలిసింది. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

**స్పందించిన కలెక్టర్**

హెడ్మాస్టర్ ఓబుళరెడ్డి మద్యం తాగి పాఠశాలకు వెళ్లిన విషయం ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం కావడంతో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ స్పందించారు. వెంటనే ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను విచారణ అధికారిగా నియమించారు.

### ఉక్కు పరిశ్రమ కోసం సదస్సు

కడప ఎడ్యుకేషన్ : విభజన హామీలో భాగంగా సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆగస్టు 10వ తేదీన కడప నగరంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు నారాయణ తెలిపారు. మేధావులు, ప్రజలు నిరుద్యోగులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం కడపలో సగిలి గుర్రప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను మొత్తం తీసుకెళ్లి కేవలం రాజధాని సాకుతో ఒక ప్రాంతంలోనే నిధులు ఉపయోగించడమేంటని ప్రశ్నించారు. పునర్విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం రాయలసీమపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. భారీ ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే అనేక వేల మందికి పరోక్షంగానూ ప్రత్యక్షంగానూ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు అంజి, జయవర్ధన్, సుబ్బరాయుడు, శంకర్, రాజేంద్రప్రసాద్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కమలాపురం పట్టణంలో యాచకవృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న వృద్ధుడు రాత్రి రోడ్డు దాటుతుండగా కడప నుంచి ఎర్రగుంట్ల వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడికి రెండు కాళ్లు, రెండు చేతులు విరిగిపోయాయి. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం పోలీసులు స్థానికుల సహాయంతో 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

# ఏసీఏ అండర్‌-16 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం



51 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మన్ సాత్విక్



4 వికెట్లు తీసిన కడప బౌలర్ గైబు



130 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ ఎస్ఎంజి ప్రభాకర్



4 వికెట్లు తీసిన కర్నూలు బౌలర్ యోహాస్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్‌–16 మల్టీ డే మ్యాచ్‌లు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప–అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాత్విక్ 51 పరుగులు, దేవాన్ష్ 28 పరుగులు చేశారు. కడప జట్టులోని గైబు చక్కటి బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. హితేష్ 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 36 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఆ జట్టులోని సయ్యద్ సిరాజుద్దీన్ 41 పరుగులు, సీఎండీ ఫైజాన్ 26 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని లిఖిత్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

**కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..**

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో చిత్తూరు–కర్నూలు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు 92.1 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ఎస్ఎంజి ప్రభాకర్ తన బ్యాటింగ్‌లో సత్తా చూపి 228 బంతుల్లో 130 పరుగులు చేశాడు. పార్థీవ్ 43 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని యాహాస్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు, సాయి విఘ్నేష్ 3 వికెట్లు, వివేక్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 10 ఓవర్లకు వికెట్ కోల్పోకుండా 44 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఓంకార్ 24 పరుగులు చేశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

## 60 ఎకరాల ఏటి పోరంబోకు భూమి ఏపీఐఐసీకి అప్పగింత

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామ పరిసరాల్లో ఉన్న ఏటి (తోపు)పోరంబోకు భూములను ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించింది. ప్రొద్దుటూరు తహసీల్దార్ గంగయ్య ఈ మేరకు సర్వే నంబర్ 699/1లో 10.54 ఎకరాలు, 699/3లో 49.46 ఎకరాల భూమిని ఏపీఐఐసీ జనరల్ మేనేజర్‌కు అప్పగించారు. ఎన్నో ఏళ్లుగా చౌడూరు ప్రాంత పేద, మధ్య తరగతి రైతులు అనధికారికంగా ఈ భూములను సాగు చేసుకుని పంటలు పండించుకుని జీవనం సాగించేవారు. ఏపీఐఐసీ అధికారులు ఈ భూమిలో రోడ్లతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు నిర్ణయించిన ధర ప్రకారం కేటాయించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సూచన మేరకు ఈ భూమిని ఏపీఐఐసీకి అప్పగించారు.

## సాగు యోగ్యమైన బీడు భూములను గుర్తించాలి

కడప అగ్రికల్చర్ : ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సాగు భూమితోపాటు సాగు యోగ్యమైన బీడు భూములను కూడా గుర్తించాల్సి ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ అన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది సర్వే నెంబర్ ప్రకారం ప్రతి రైతుకు ఎంత సాగుభూమి ఉంది, ఎంత సాగు యోగ్యం కాని భూమి ఉందనే విషయాలను పక్కగా గుర్తించాలని సూచించిందన్నారు. ఇందుకోసం అలాంటి ప్రాంతాలలో పనిచేసే వీఏఏలకు పనిభారం తగ్గించేందుకు వీరికి సహాయకులుగా ఎంపీఈఓలను పంపనున్నామన్నారు. ఇందుకోసం మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఎంపీఈఓల రీ పోస్టింగ్ కోసం వారి నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఎంపీఈఓలు 89 మంది మాత్రమే ఉన్నారని వీరిని సహాయకులుగా కేటాయిస్తామని తెలిపారు. ఇంకా తక్కువ వస్తే ఆత్మలో పని చేసే ఏటీఎం, బీటీఎంలను పంపుతామన్నారు. వీరంతా కలసి ఏఏ సర్వే నెంబర్‌లో ఎంతెంత సాగు భూమి ఉంది, ఎంత సాగుయోగ్యం కాని భూమి ఉందనే విషయాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. సాగు పంటలకు పక్కగా ఈ క్రాపు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

### ముగ్గురాయి గనులను పరిశీలించిన మైనింగ్ అధికారులు



వేముల సమీపంలోని గని నుంచి తీసిన ముగ్గురాయిని పరిశీలిస్తున్న అధికారులు

వేముల : మండల కేంద్రమైన వేములకు సమీపంలోగల ముగ్గురాయి గనులను జిల్లా గనులశాఖ అధికారి రామసుబ్రమణ్యం ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం పరిశీలించారు. వేముల, వేంపల్లె మండలాల్లో అక్రమ ముగ్గురాయి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని, ఎలాంటి రాయల్టీలు చెల్లింకుండా ముగ్గురాయిని అక్రమంగా తరలిస్తున్నారని, ఎస్‌సీఎల్టీ పరిధిలోని ముగ్గురాయిని రాత్రికి రాత్రే కొంతమంది అక్రమంగా ముగ్గురాయిని తరలించి సొమ్ము చేసుకున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన మైనింగ్ అధికారి రామసుబ్రమణ్యం, ఆర్ఐ విమలమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ ఆమనిలతో కలిసి ముగ్గురాయి గనులను పరిశీలించారు. ఇంకా ఆ పరిసరాల్లో ముగ్గురాయి గనులను పరిశీలించాల్సి ఉందని, బుధవారం మరోసారి పరిశీలిస్తామని గనుల శాఖ అధికారి వెల్లడించారు.

### జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జీసీడీఓ



ఉపాధ్యాయులతో సమావేశమైన జీసీడీఓ రూత్ ఆరోగ్యమేరీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం జీసీడీఓ, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి రూత్‌ఆరోగ్యమేరీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఒకేషనల్ శిక్షకులైన సునీల్‌కుమార్, వాసుదేవరెడ్డి, అక్షయకుమార్‌లతో మాట్లాడి విద్యార్థులకు ఒకేషనల్ విద్యను పూర్తిస్థాయిలో అందించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, అలాగే ల్యాబ్ సౌకర్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామయ్య, ఉపాధ్యాయులు సి.రామచంద్రారెడ్డి, రామసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, ప్రకాష్‌రావు, నరసింహారెడ్డి, థామస్‌ఫ్రాన్సిస్‌బాబు, రామకృష్ణయ్య, దేవానందం పాల్గొన్నారు.

### సంతాన సాఫల్య కేంద్రాల తనిఖీ



సంతాన సాఫల్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని సంతాన సాఫల్య కేంద్రాలను మంగళవారం జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తనిఖీ చేశారు. ఆయా హాస్పిటళ్లలోని వసతులు, రికార్డులను ఈ సందర్భంగా పరిశీలించారు. అలాగే అక్కడి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వారికి తగు సూచనలు ఇచ్చారు. సంతాన సాఫల్య కేంద్రాల్లో ఎలాంటి తప్పిదాలు జరిగినా చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. స్త్రీ వ్యాధి నిపుణులు ఉన్న ఆస్పత్రులన్నీ ఏఆర్‌టీ లెవెల్‌–1 రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వానికి చిన్నచూపు

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్.శివరామ్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శివరామ్

కడప కార్పొరేషన్ : బీసీ సంక్షేమ హాస్టళ్ల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. శివరామ్ విమర్శించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత సవాల్ విసరడం హాస్యాస్పదమన్నారు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం రోజూ మధ్యాహ్నం సాంబారు, అన్నంతో సరిపెట్టి రూ.450 కోట్లు ఖర్చు చేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 16 రకాల పదార్థాలతో 'జగనన్న గోరుముద్ద' కార్యక్రమానికి ఏకంగా రూ.7245 కోట్లు ఖర్చు చేశారన్నారు. పిల్లల్లో రక్తహీనతను అరికట్టడానికి వారంలో మూడు రోజుల పాటు బెల్లంతో చేసిన రాగి జావ, చిక్కీ, వారంలో ఐదు రోజులు ఉడికించిన కోడిగుడ్డును తప్పనిసరి చేశారని గుర్తు చేశారు. ఇక ప్రతి నెలా స్థానిక ఆస్పత్రి వైద్య సిబ్బందితో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి ఫోలిక్ యాసిడ్ (ఐరన్) మాత్రలు, టానిక్‌లు ఇచ్చేవారన్నారు. కానీ ఇప్పుడు పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో నారా వారి స్పెషల్‌గా బొద్దింకల భోజనం పెడుతున్నారని, గోరుముద్దను కాస్తా ఘోర ముద్దగా మార్చారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర కార్యదర్శి కె. శివయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బాదుల్లా, జిల్లా కార్యదర్శి నరసయ్య, నగర కార్యదర్శి క్రిష్ణ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.